విశ్వాసి ఇల్లు

ఒక విశ్వాసి గుర్తింపు అతని ధార్మిక విశ్వాసమే. ఇస్లామ్ అతని గుర్తింపుగా ఉంటుంది. అదేవిధంగా అతని ఇల్లు కూడా ఇస్లామీయ విశ్వాసాలకు నిలయంగా, ఆచరణాత్మక ఉదాహరణగా ఉంటుంది. ఆ ఇంటి నుంచి ఇస్లామీయ విశ్వాసపు సుగంధం నలువైపులా విస్తరిస్తుంది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ జీవిత చరిత్ర ఈ విషయంలోను మనకు ఆచరణాత్మకమైన ఉదాహరణ. మనం కూడా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ మాదిరిగా మన ఇండ్లను మస్జిదులుగా మార్చుకోవాలి. సున్నతులు, నఫీళ్ళను క్రమం తప్పక ఇంట్లో పాటించాలి. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా అన్నారు: "ప్రజలారా, మీ నఫీల్ నమాజులను మీ ఇంటనే ఆచరించండి. ఎందుకంటే, ఫరజ్ నమాజుల తర్వాత ఉత్తమమైన నమాజు ఇంట చదివే నమాజు." (ముత్తఫికున్ అలైహ్)

ఇండ్లలో నమాజులు చదువుతూ ఉంటే ఇల్లు అల్లాహ్ ఆరాధనకు, అల్లాహ్ విధేయతకు నిలయంగా మారిపోతుంది. అల్లాహ్ పట్ల విధేయతకు చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. అల్లాహ్ ఆదేశాలు, ఆజ్ఞాపాలనల వాతావరణం అలుముకుంటుంది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా అన్నారు : "మీ నమాజులు కొన్ని (నఫీళ్ళు) ఇండ్లలోనే చదవండి. వాటిని స్మశానాలుగా మార్చకండి." (ముత్తఫికున్ అలైహ్). మరో చోట ఇలా చెప్పారు: "మీలో ఎవరు మస్జిదులో నమాజు చదివినా తమ నమాజులో కొంతభాగం ఇంటికి కూడా కేటాయించాలి. ఎందుకంటే దానివల్ల అల్లాహ్ మీ ఇంట శ్రేయం మేలు కలుగుజేస్తాడు." (ముస్లిమ్)

స్త్రీల నమాజులన్నీ ఇంట చదవడమే ఉత్తమమని చెప్పడం జరిగింది. హజ్రత్ ఉమ్మె హమీద్ సాదియా రజిఅల్లాహు అన్హా ప్రకారం ఆమె ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వద్దకు వచ్చి "ప్రవక్తా, నేను మీతో పాటు నమాజు చదవాలనుకుంటున్నాను" అనడిగారు. ఆయన జవాబిస్తూ, "మీ మనోభావాలను నాకు తెలుసు, కాని, మీరు మీ ఇంట నమాజు చదవడమే ముహల్లా మస్జిదులో నమాజు చదవడం కన్నా ఉత్తమం" అన్నారు. (అహ్మద్, తిబ్రానీ)

ఇంటి వాతావరణాన్ని ఇస్లామీయ సూత్రాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోడానికి ఇంట్లో ఒక భాగాన్ని ఆరాధనలకు ప్రత్యేకించుకుంటే ఎంత బాగుంటుంది? అక్కడ కేవలం

www.izarilahi.com

నమాజులు చదవడం మాత్రమే కాదు, ఇంటి వారంతా కలిసి అల్లాహ్ నామస్మరణ చేస్తుంటే ఎంత బాగుంటుంది? ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా అన్నారు: "ఇంటిలోని వారంతా కలిసి అల్లాహ్ నామస్మరణ, జిక్ర్ చేస్తున్న ఇళ్లు, అల్లాహ్ స్మరణ జరగని ఇల్లు రెండింటి పోలిక ఎలాంటిదంటే, ఒకటి సజీవమైనది, రెండవది మరణించినది." (ముస్లిమ్)

ఇంటిలోని వారంతా కలిసి ఇంట్లో దివ్యఖుర్ఆన్ పారాయణం చేస్తుంటే ఎంత మంచి వాతావరణం ఏర్పడుతుంది. ప్రతి నెల ప్రతి ఒక్కరు ఒక్కో సారి దివ్యఖుర్ఆన్ పూర్తిగా చదవాలన్న నియమం పెట్టుకుంటే ఎంత బాగుంటుంది? అలాగే వారానికి ఒకసారి లేదా నెలకు ఒకసారి ఇంట్లో వారంతా కూర్చుని, దివ్యఖుర్ఆన్ పాఠం లేదా హదీసు పాఠం, ఇస్లామీయ షరిఅత్ గురించి అధ్యయనం చేస్తుంటే ఎంత మంచి వాతావరణం ఏర్పడుతుంది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ జీవితచరిత్రను అంతా కలిసి చదువుతుంటే ఎంత బాగుంటుంది? నిజానికి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ సహచరుల ఇండ్లు ఇలాగే ఉండేవి. వారి ఇండ్లలో అల్లాహ్ నామస్మరణ ఎల్లప్పుడు కొనసాగుతూ ఉండేది. వారి ఇండ్లలో దివ్యఖుర్ఆన్ పారాయణం ప్రతిధ్వనిస్తూ ఉండేది. వారి ఇంటి వైపు ఎవరైనా వెళితే వారికి దివ్యఖుర్ఆన్ పారాయణం వినిపించేది. వారు రాత్రిళ్ళు అల్లాహ్ సమక్షంలో సజ్దాలో వేడుకునేవారు. అత్యంత దీనాతిదీనంగా అల్లాహ్ ని ప్రార్థించేవారు. వారి గద్గదమైన స్వరం ఇంటి బయటకు కూడా వినిపించేది. నేడు కూడా మనం మన ఇండ్లను ఇలా మార్చుకోవచ్చు. నిజానికి అలా మార్చుకోవడమే మనం చేయవలసిన పని. ప్రతి సంవత్సరం కొన్ని ప్రత్యేకమైన రోజులు కూడా వస్తాయి. ఆ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లతో అల్లాహ్ ఆరాధన ఇండ్లలో కొనసాగేలే చేసుకోవాలి. ఉదాహరణకు రమజాన్ పవిత్ర మాసం. ఈ నెల రోజులు పిల్లలు మొదలు ముసలి వారి వరకు అందరూ ఆరాధనల్లో నిమగ్నమైపోతారు. అల్లాహ్ నామస్మరణ కొనసాగుతుంది. అదేవిధంగా జిల్ హజ్జ మొదటి పదిరోజులు. లేదా అయ్యామ్ బైజ్, ఇలాంటి రోజుల్లో అల్లాహ్ ఆరాధనలతో ఇండ్లు కళకళలాడేలా చేసుకోవాలి. ఇల్లు అల్లాహ్ అనుగ్రహాలు, మేళ్ళు, శుభాలతో నిండిపోతుంది. దీని వల్ల ముఖ్యంగా రేపటి తరంపై అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రభావం పడుతుంది. వారికి అవసరమైన ఆచరణాత్మకమైన, భావపరమైన శిక్షణ లభిస్తుంది. మన ఇండ్లు కూడా మస్జిదుల్లో ఒక భాగం అయిపోతే ఎంత బాగుంటుంది?

* * *

www.uzairfalahi.com